

పెదవలస రేంజ్ అధికారిగా శివరంజిని



చింతపల్లి, జూన్ 15: డివిజన్ పరిధిలోని పెదవలస రేంజ్ అధికారిగా ఉత్తర కవటం శివరంజని నియమితులయ్యారు. పెదవలస రేంజ్ అధికారి జగదీశ్వరరావు రెండు రోజుల క్రితం సస్పెండ్ అయిన విషయం పాఠకులకు విదితమే. ఆయన స్థానంలో శిక్షణ పూర్తి చేసుకున్న శివరంజనికి పెదవలస రేంజ్ అధికారిగా తొలి పోస్టింగ్ ఇచ్చారు. ఆమె స్వగ్రామం ఎస్.కోట. ఏపీపీఎస్సీ ద్వారా ఎంపికైన ఆమె మహారాష్ట్ర చంద్రపూర్ ఫారెస్టు అకాడమీలో శిక్షణ పొందారు.

పరాయి పంచన ప్రభుత్వ కార్యాలయాలు

కొత్త జిల్లా ఏర్పడి రెండేళ్లయినా మారని పరిస్థితి

- డివిజన్ కార్యాలయాల్లోనే జిల్లా ఆఫీసులు
- జిల్లా అధికారుల నియామకాలే లేవు.. అన్నీ సర్దుబాటులే..
- ఇతర ప్రాంతాల అధికారులు తాత్కాలిక పద్ధతిలో నియామకం
- జిల్లా అయినా.. డివిజన్ స్థాయి పాలనా అనుభూతే
- యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో కలెక్టరేట్..
- ప్రైవేటు ఫంక్షన్ హాలులో ఎస్పీ ఆఫీస్..

అల్లూరి సీతారామరాజు పాడేరు జిల్లా ఏర్పాటు చేసి ఏప్రిల్ నాటికి రెండేళ్లు పూర్తయినప్పటికీ కలెక్టరేట్ భవనాల సముదాయానికి ఇంకా పునాది పడలేదు. ఆరంభంలో ఏర్పాటు చేసిన చోటే ప్రభుత్వ కార్యాలయాల్లో పాలన సాగుతోంది. జిల్లా స్థాయి అధికారుల నియామకాలు ఇంకా చేపట్టలేదు. ఇతర ప్రాంతాల అధికారులను తాత్కాలిక పద్ధతిలో నియమించడం వల్ల వారంతా చుట్టపు చూపుగా వస్తుండడంతో పాలన ఇంకా గాడిలో పడలేదు.

(పాడేరు-ఆంధ్రజ్యోతి)

పాడేరు కేంద్రంగా అల్లూరి సీతారామరాజు జిల్లా పాలన ప్రారంభమై ఏప్రిల్ నాటికి రెండేళ్లు పూర్తయినప్పటికీ ఒక ప్రభుత్వ కార్యాలయానికి సొంత భవనం లేని దుస్థితి కొనసాగుతున్నది. 2022లో హడావిడిగా కొత్త జిల్లా ఏర్పాటు చేశారు. అప్పుడు కేటాయించిన భవనాల్లో నేటికీ ప్రభుత్వ కార్యాలయాలు కొనసాగుతున్నాయి. కొత్త జిల్లాలకు అవసరమైన శాశ్వత భవన నిర్మాణాలు చేపడతామని అప్పట్లో వైసీపీ ప్రభుత్వం ప్రకటించినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. కలెక్టరేట్‌లో ఉండే.. కలెక్టర్, జాయింట్ కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారి, ముఖ్య ప్రణాళికాధికారి, డ్వామా, డీఆర్‌డీఏ, జిల్లా ఉద్యానవన శాఖ, జిల్లా ఖజానాధికారి కార్యాలయాలకు మాత్రమే ఫర్నిచర్, ఇంటర్నెట్ సదుపాయాలు కల్పించారు. అలాగే ఓ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన ఎస్పీ కార్యాలయానికి ఫర్నిచర్, ఇంటర్నెట్ సౌకర్యాలున్నాయి. ఇతర జిల్లా కార్యాలయాలకు ప్రభుత్వం నుంచి కనీసం బెంచీ, కుర్చీ వంటివి కూడా ఇవ్వలేదు. దీంతో శాఖలకు చెందిన అధికారులే వాటిని సమకూర్చుకున్నారు.



అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టరేట్ భవనం



మినీ స్టేడియంలో భవనంలో బీసీ వెల్ఫేర్, ఫైర్, జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాలు

కొత్త జిల్లాకు శాశ్వత అధికారులేరీ..?

ప్రభుత్వం కొత్త జిల్లా ఏర్పాటు చేసినప్పటికీ పలు జిల్లా అధికారుల పోస్టులకు నియామకాలు చేపట్టలేదు. కేవలం ఇతర ప్రాంతాల్లోని అధికారులను ఇక్కడ తాత్కాలిక పద్ధతిలో నియమించారు. దీంతో ఆయా శాఖల అధికారులు చుట్టపు చూపుగా పాడేరు వస్తున్నారనే ఆరోపణలున్నాయి. అలాగే కలెక్టరేట్ మినహా ఇతర జిల్లా కార్యాలయాలన్నీ ఇక్కడున్న డివిజన్ ఆఫీసుల్లో తమ కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయి. ఇందుకు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయాలన్నే ఉదాహరణగా చెప్పుకోవచ్చు. స్థానిక పీఎంఆర్సీ భవనంలో ఉన్న ఏజెన్సీ డీఈవో కార్యాలయంలోనే జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. అదేవిధంగా ఇతర జిల్లా శాఖల కార్యాలయాల పరిస్థితి ఉంది.

రెండేళ్లయినా అదే పరిస్థితి

తొలి ఏడాదిలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన భవన సముదాయంలో ఎనిమిది జిల్లా కార్యాలయాలకు గదులను కేటాయించారు. కానీ ఆయా కార్యాలయాలకు ఫర్నిచర్, ఇంటర్నెట్, ఇతర కనీస సదుపాయాలు లేకపోవడంతో కేవలం రెండు కార్యాలయాలు మాత్రమే అరకొరగా పనిచేస్తున్నాయి. జిల్లా సహకార సంస్థ, జిల్లా ఆడిట్ కార్యాలయం, జిల్లా అగ్నిమాపక కార్యాలయం, జిల్లా మైనారిటీ సంక్షేమ కార్యాలయం, ఏపీ మైనారిటీ ఫైనాన్స్ కార్యాలయం, జిల్లా వికలాంగుల సంక్షేమ శాఖ కార్యాలయం, జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు భవనాలను కేటాయించారు. తర్వాత వాటిని వేర్వేరు భవనాల్లోకి మార్చారు. వీటిలో జిల్లా సహకార సంస్థ, జిల్లా ఆడిట్ కార్యాలయాల సిబ్బంది ... మిగతా 6వ పేజీలో

హోం మంత్రి అనితకు అపూర్వ స్వాగతం

- గజమాలలతో సత్కారం
- విజయోత్సవ ర్యాలీకి అశేషంగా తరలి వచ్చిన టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు



పాయకరావుపేట గౌతమ్ సెంటర్‌లో హోం మంత్రి అనితను గజమాలతో సత్కరిస్తున్న దృశ్యం

పాయకరావుపేట/రూరల్, జూన్ 15: రాష్ట్ర హోంమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా శనివారం సొంత నియోజకవర్గం పాయకరావుపేట చేరుకున్న వంగలపూడి అనితకు ఎన్డీఏ కూటమి శ్రేణులు అపూర్వ స్వాగతం పలికాయి. సాయంత్రం 4.30 గంటలకు పాయకరావుపేట చేరుకున్న మంత్రి అనితకు తాండవ వంతెనపై టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు గజమాలతో ఘన స్వాగతం పలికారు. అక్కడ నుంచి వై.జంక్షన్ వరకు రెండు కిలోమీటర్ల మేరకు నిర్వహించిన విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న మంత్రి అనితకు దారిపొడవునా అభిమానులు పూలవర్షంతో ముంచెత్తారు. పలు సెంటర్లలో మంత్రి అనితకు మహిళలు హారతులు ఇవ్వగా, పలువురు నాయకులు గజమాలలతో సత్కరించారు. స్థానిక సూర్యమహల్ సెంటర్లో సత్యవరం, మాసాహెబ్‌పేట టీడీపీ నాయకులు తమలపాకుల గజమాలతో ఘనంగా సత్కరించారు. మెయిన్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న ప్రజలకు మంత్రి అనిత అభివాదం చేసుకుంటూ ముందుకు కదిలారు. అనంతరం స్థానిక పాండురంగస్వామి ఆలయంలో ఆమె ప్రత్యేక పూజలు చేశారు.

'పేట' ప్రజలకు రుణపడి ఉంటా..

పాయకరావుపేట నియోజకవర్గంలో చరిత్ర సృష్టించినంతగా మెజారిటీ ఇచ్చిన ప్రజలకు తాను, తన కుటుంబం ఎంతో రుణపడి ఉంటుందని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. శనివారం స్థానిక పాండురంగస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం విలేకరులతో మాట్లాడారు. పాయకరావుపేట నియోజకవర్గం ఏర్పడిన తరువాత ఇంతకాలానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దయతో తనకు మంత్రి పదవి రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సీఎం, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తనపై గురుతర బాధ్యత పెట్టారన్నారు.



చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం

అరకులోయలో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు

- అరకులోయలో ఐదు సంతకాల సంబరాలు
- అరాచక పాలనను ప్రజలు అంతమొందించారు : టీడీపీ నేతలు

అరకులోయ, జూన్ 15: రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఎన్నికల్లో ఇచ్చిన ఐదు హామీలను అమలు చేస్తూ 5 ఫైళ్లపై సంతకాలు పెట్టిన నారా చంద్రబాబునాయుడు చిత్రపటానికి అరకులోయలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాలాభిషేకం చేశారు. శనివారం పెదలబుడు సర్పంచ్ పెట్టెలి దాసుబాబు, టీడీపీ మండల నాయకులు, మహిళలు పంచాయతీ ఆఫీసు ప్రాంగణంలో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేసి సీఎంపై తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా పెదలబుడు ... మిగతా 6వ పేజీలో



మన్యంలో ముసురు

హుకుంపేటలో కురుస్తున్న వర్షం

- నైరుతి రుతు పవనాల ప్రభావంతో వర్షాలు
- రోడ్లన్నీ జలమయం

పాడేరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాల ప్రభావంతో మన్యంలో ముసురు పట్టింది. శనివారం కూడా భారీ వర్షం కురిసింది. జిల్లా కేంద్రం మొదలుకుని ఏజెన్సీ వ్యాప్తంగా ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సాధారణ వాతావరణం కొనసాగి ఎండ కాసింది. ఆ తర్వాత నుంచే వాతావరణంలోని మార్పులు చోటుచేసుకుని ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ వర్షానికి రోడ్లన్నీ జలయమం కాగా.. జనజీవనానికి అంతరాయం ఏర్పడింది. అయితే భారీ వర్షాలకు పిడుగులు పడే అవకాశం ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నివారణ సంస్థ హెచ్చరించింది.

ప్రజాపాలన మొదలైంది



విలేకరులతో మాట్లాడుతున్న కిడారి శ్రావణ్‌కుమార్, పక్కన గిడ్డి ఈశ్వరి

- అరకులోయ పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ అధ్యక్షుడు కిడారి శ్రావణ్‌కుమార్
- చంద్రబాబు కోసం మోదకొండమ్మకు ప్రత్యేక పూజలు

పాడేరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల అరాచక పాలన ముగిసిందని, ప్రస్తుతం రాష్ట్రంలో ప్రజాపాలన మొదలైందని అరకులోయ పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ అధ్యక్షుడు, మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్ అన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు బాధ్యతలు స్వీకరించిన అనంతరం ప్రధాన ఐదు ఫైళ్లపై తొలి రోజు సంతకాలు చేసిన సందర్భంగా శనివారం ఆయన స్థానిక మోదకొండమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరితో కలిసి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రానికి చక్కని అభివృద్ధి, సంక్షేమం అందించేందుకు కృషిచేస్తున్న సీఎం చంద్రబాబు నాయుడుకు మరింత శక్తిని, ఆరోగ్యాన్ని ఇవ్వాలని మోదకొండమ్మను కోరామన్నారు. అలాగే ఇచ్చిన మాటకు కట్టుబడి సీఎంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే 16,347 పోస్టులతో మెగా డీఎస్సీపై తొలి సంతకం చేశారన్నారు. అలాగే తీవ్ర ప్రజావ్యతిరేకతను ఎదుర్కొన్న ల్యాండ్ టైటలింగ్ చట్టం, పెన్షన్ల పెంపు, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, నైపుణ్య గణనపై సంతకాలు చేయడం విశేషమన్నారు. ఇన్నాళ్లు వైసీపీ పాలనలో ఇబ్బందులు, సమస్యలు, దౌర్జన్యాలతో ప్రజలు తీవ్ర అవస్థలు ... మిగతా 6వ పేజీలో

అక్రమ కలప పట్టివేత

రూ. 1.2 లక్షల విలువైన కలప స్వాధీనం



స్వాధీనపరుచుకున్న కలపతో అటవీ శాఖ సిబ్బంది

కొయ్యూరు, జూన్ 15: అటవీ ప్రాంతం నుంచి అక్రమ రవాణా చేసేందుకు సిద్ధం చేసిన 28 కలప దుంగలను పెదవలస అటవీ రేంజ్ అధికారిణి శివరంజని ఆధ్వర్యంలో అటవీ సిబ్బంది శుక్రవారం సాయంత్రం దాడి చేసి పట్టుకున్నారు. చింతలపూడి పంచాయతీ గింజర్తి గ్రామ శివారులో అక్రమ రవాణాకు కలప దుంగలు సిద్ధంగా ఉంచారనే సమాచారం మేరకు దాడి చేశారు. ఈ దాడులలో బండారు 14 దుంగలు, గన్నర 12 దుంగలు పట్టుబడ్డాయి. వీటి విలువ రూ. 12 లక్షలు ఉంటుందని రేంజర్ శివరంజని తెలిపారు.

మారుజాతి వనాలపై గొడ్డలి వేటు

గొందిపల్లి, బోనంగిపల్లి కాఫీ తోటల్లో నరికివేత

- మైదాన ప్రాంతాలకు తరలించేందుకు ప్రయత్నం
- పట్టించుకోని అటవీ శాఖ అధికారులు



గొందిపల్లిలో రవాణాకు సిద్ధంగా ఉన్న దుంగలు

గూడెంకొత్తవీధి, జూలై 15: మండలంలోని గొందిపల్లి, బోనంగిపల్లి గ్రామాల్లో ఏపీఎఫ్‌డీసీ కాఫీ తోటల్లో నీడనిచ్చే విలువైన మారుజాతి వృక్షాలను గుర్తు తెలియని వ్యక్తులు నరికివేశారు. ఈ దుంగలను కొంతమంది వ్యాపారులు రహస్యంగా మైదాన ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏళ్ల నాటి విలువైన మారుజాతి వృక్షాలు వ్యాపారులు దోచుకుంటున్నప్పటికీ అటవీ శాఖ అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు. వివరాల్లోకి వెళితే..

ఆర్‌వీనగర్ డివిజన్ పరిధిలోని ఏపీఎఫ్‌డీసీ గొందిపల్లి, బోనంగిపల్లి ఎస్టేట్ల పరిధిలో ఉన్న కాఫీ తోటలను సీపీఐ మావోయిస్టులు స్థానిక గిరిజనులకు పంపిణీ చేశారు. నాటి నుంచి ఈ తోటలపై ఏపీఎఫ్‌డీసీ అధికారుల పర్యవేక్షణ లేదు. స్థానిక గిరిజనులు కాఫీ తోటల నుంచి పండ్లను సేకరించుకుని విక్రయించుకుంటున్నప్పటికీ సస్యరక్షణ చర్యలు చేపట్టడం లేదు. దీంతో కాఫీ తోటల్లో దిగుబడులు గణనీయంగా పడిపోయాయి. తాజాగా గుర్తు తెలియని కొంత మంది వ్యాపారులు కాఫీ తోటలకు నీడనిచ్చే సుమారు 15 ఏళ్ల నాటి నల్లమద్ది ... మిగతా 6వ పేజీలో

ముగిసిన ఎల్‌నినో

- పసిఫిక్‌లో మొదలైన తటస్థ పరిస్థితులు
- చివరి త్రైమాసికం నాటికి లానినా
- ఎల్‌నినో ప్రభావితంతో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు, వడగాడ్పుల నమోదు
- మరికొన్ని రోజులు వేడి వాతావరణం
- వచ్చే ఐదు రోజులు రాష్ట్రంలో వర్షాలు



విశాఖపట్నం/అమరావతి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది నుంచి ప్రపంచ వ్యాప్తంగా ప్రచండమైన వేడి వాతావరణం, వడగాడ్పులకు కారణమైన ఎల్‌నినో కథ ముగిసింది. ప్రస్తుతం పసిఫిక్ మహాసముద్రంలో తటస్థ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ఏడాది చివరి త్రైమాసికంలో లానినా ఏర్పడనున్నది. పసిఫిక్ మహాసముద్రంలో మరికొన్ని రోజులు తటస్థ పరిస్థితులు కొనసాగుతాయని ఆస్ట్రేలియా వాతావరణ విభాగం ప్రకటించింది. గత ఏడాది ఏర్పడిన ఎల్‌నినో తీవ్రతకు మునుపెన్నడూ లేనంతగా ప్రతినెలా రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అనేక దేశాల్లో తీవ్ర దుర్భిక్షం నెలకొనడంతో ఆహార ధాన్యాల ఉత్పత్తి గణనీయంగా తగ్గింది. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో సూపర్ ఎల్‌నినోగా మారడంతో అత్యంత దుర్భర పరిస్థితులు ఏర్పడ్డాయి. అయితే మార్చి నెల తరువాత ఎల్‌నినో అనూహ్యంగా బలహీనపడడం ప్రారంభమైంది. మే నాటికి పసిఫిక్ మహాసముద్రంలో ఎల్‌నినో బలహీనపడి తటస్థ పరిస్థితులు ఏర్పడేందుకు అనుకూలమైన వాతావరణం నెలకొంది. జూన్ నెల రెండో వారం వచ్చేసరికి ఎల్‌నినో ముగిసింది. ఈ ఏడాది వేసవిలో సాధారణం కంటే ఎక్కువగా వడగాడ్పులు వీస్తాయని వాతావరణ శాఖ ముందుగానే వెల్లడించింది. అంచనా వేసినట్టుగానే మార్చి ఒకటో తేదీ నుంచి జూన్ తొమ్మిదో తేదీ వరకు దేశంలో రికార్డు స్థాయిలో వడగాడ్పులు వీచాయని వాతావరణ శాఖ తెలిపింది. గతంలో ఎన్నడూ లేనంతగా వడగాడ్పులు/తీవ్ర వడగాడ్పులు కొనసాగడంతో దేశంలో చాలా ప్రాంతాల్లో ప్రజలు అల్లాడిపోయారు. ఒడిసాలో అత్యధికంగా 27 రోజులు, పశ్చిమ రాజస్థాన్‌లో 23 రోజులు వడగాడ్పులు/తీవ్ర వడగాడ్పులు వీచాయి. దేశంలో 36 వాతావరణ సబ్ డివిజన్‌లలో 14 సబ్ డివిజన్‌లలో 15 రోజులు, అంతకంటే ఎక్కువగా వడగాడ్పులు/తీవ్ర వడగాడ్పులు వీయడం ఇదే తొలిసారని నిపుణులు వెల్లడించారు. పశ్చిమ బెంగాల్‌లో 21 రోజులు, ఢిల్లీ, హరియాణాలో 20 రోజులు వడగాడ్పులు వీచాయి. వేసవి విడిది కేంద్రాలైన హిమాచల్‌ప్రదేశ్‌లో 12, జమ్మూకశ్మీర్‌లో 6 రోజుల పాటు వడగాడ్పులు వీచాయి. ఈ నెల 18వ తేదీ వరకు ఢిల్లీ, హరియాణా, పంజాబ్, ఉత్తరప్రదేశ్‌లలో వడగాడ్పులు కొనసాగుతాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ ఏడాది చాలా ప్రాంతాల్లో రోజుల తరబడి 45 డిగ్రీలు మించి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాజస్థాన్, ఢిల్లీల్లో 50 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గ్లోబల్ వార్మింగ్‌కు తోడు స్థానికంగా ఏర్పడే ప్రతికూల పరిస్థితులు కూడా ఇందుకు దోహదం చేశాయని విశ్లేషకులు చెబుతున్నారు. ఎల్‌నినో ముగిసినా, దాని ప్రభావంతో దేశంలో మరికొన్ని రోజులు వేడి వాతావరణం కొనసాగుతుందని వివరించారు.

రానున్న ఐదు రోజులు వర్షాలు

ఉపరితల ద్రోణి ప్రభావంతో రానున్న ఐదు రోజులు కోస్తాంధ్ర, రాయలసీమలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. అక్కడక్కడా పిడుగులు పడే అవకాశం ఉందని హెచ్చరించింది. ఆదివారం అల్లూరి, పల్నాడు, ప్రకాశం, నంద్యాల, శ్రీసత్యసాయి, కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులతో కూడిన వర్షాలు పడతాయని పేర్కొంది. శనివారం ఉదయం నుంచి కోస్తాలో తీవ్రమైన ఎండ, ఉక్కపోత కొనసాగాయి. బాపట్ల, తునిలో 40.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. సాధారణంగా జూన్ నెలలో 40 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదుకావడం అరుదుగా జరుగుతుందని వాతావరణ నిపుణులు తెలిపారు.

ఏయూలో వైఎస్ విగ్రహాన్ని తొలగించాలి

- వీసీ, రిజిస్ట్రార్‌లకు టీఎన్ఎస్ఎఫ్ వినతిపత్రం


రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందిస్తున్న ప్రణవ్, తదితరులు

విశాఖపట్నం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని తొలగించాలని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రణవ్‌గోపాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏయూ వీసీ ప్రసాద్‌రెడ్డి, రిజిస్ట్రార్ స్టీఫెన్‌లను కలిసి విగ్రహాన్ని వారం రోజుల్లోగా తొలగించాలంటూ వినతిపత్రం సమర్పించారు. విశ్వవిద్యాలయాలను రాజకీయ కేంద్రాలు చేయకూడదన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన విద్యార్థి విభాగ రాష్ట్ర నాయకుడు ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఏయూను ప్రక్షాళన చేయండి

- వర్సిటీ వనరులు, నిధులు గత ఐదేళ్లుగా వైసీపీ కోసం దుర్వినియోగం
- యూజీసీ నిధులు దుర్వినియోగం, ప్రొఫెసర్ల నియామకాల్లో అవకతవకలు
- సీఎంకు న్యాయ విద్యార్థిని సత్యాల అంజన ప్రియ ఫిర్యాదు
- విచారణకు సిట్టింగ్ జడ్జి/ప్రత్యేక బృందాన్ని నియమించాలని విజ్ఞప్తి

విశాఖపట్నం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలో అవినీతి పెరిగిపోయిందని, ప్రక్షాళన చేయాలని న్యాయ విద్యార్థిని సత్యాల అంజన ప్రియ శనివారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు ఫిర్యాదు చేశారు. వర్సిటీలో గడిచిన ఐదేళ్లలో అవినీతి, అధికార దుర్వినియోగం పెరిగిపోయాయని, రాజకీయ ప్రయోజనాల కోసం విద్యార్థులను ఉపయోగించుకున్నారని ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఏయూ వీసీ ప్రసాదరెడ్డి బాధితురాలిగా ఈ విషయాలను తమ దృష్టికి తీసుకువస్తున్నట్టు వెల్లడించారు. గతంలో వర్సిటీలో జరుగుతున్న అవినీతిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినందుకు హాస్టల్ వార్డెన్ వేధించారన్నారు. తన ఫిర్యాదుపై ఏయూ వీసీ విచారణ చేపట్టకుండా తనను అలవాటుదారు ఆర్‌టీఐ దరఖాస్తుదారునిగా తప్పుడు ముద్ర వేశారని ఆవేదన వ్యక్తంచేశారు. దీనిపై భారత ప్రభుత్వ షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్ (ఎన్‌సీఎస్‌సీ)కు ఫిర్యాదు చేసినట్టు పేర్కొన్నారు. వర్సిటీ వనరులు, నిధులు, వైసీపీ కోసం దుర్వినియోగం అయిన సందర్భాలు అనేకం ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. ఆయన పాలనను విద్యార్థులు, ఉద్యోగులు ప్రశ్నిస్తే తప్పుడు కేసులతో అణిచివేశారని ఆమె ఆరోపించారు. యూజీసీ నిధులు దుర్వినియోగం, అవినీతి, ప్రొఫెసర్ల నియామకాల్లో అవకతవకల గురించి గవర్నర్‌కు ఫిర్యాదు చేశానని, అయినా విచారణ మాత్రం చేపట్టలేదన్నారు. వర్సిటీలో జరిగిన అక్రమాలపై తక్షణమే సిట్టింగ్ జడ్జి/ప్రత్యేక బృందాన్ని నియమించి విచారణ జరిపించాలని ఆమె తన లేఖలో సీఎం చంద్రబాబునాయుడును కోరారు. వందేళ్ల ఉత్సవాలకు సిద్ధమవుతున్న తరుణంలో ఏయూలో అవినీతిని నిర్మూలించి, అవినీతిపరులను తొలగించి ప్రక్షాళన చేయాలని ఆమె కోరారు. రాజకీయాలు లేని పరిపూర్ణమైన అధ్యయన వాతావరణంతో కూడిన విద్యా సంస్థను విద్యార్థులకు బహుమతిగా సీఎం అందిస్తారని తాను ఆశిస్తున్నానన్నారు.

పలాస, గుణుపూర్, బ్రహ్మపూర్ రైళ్లు తాత్కాలిక రద్దు

విశాఖపట్నం, జూన్ 15: వాల్తేరు డివిజన్ పరిధిలో బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో ఈనెల 17, 18వ తేదీల్లో పలు రైళ్లను రద్దు చేసినట్టు సీనియర్ డీసీఎం కే సందీప్ తెలిపారు. ఈనెల 17న విశాఖ-పలాస (07 470), పలాస-విశాఖ (07401), విశాఖ-గుణుపూర్ (08522), గుణుపూర్-విశాఖ (08521), విశాఖ-బ్రహ్మపూర్ (18526), ఈనెల 18న బ్రహ్మపూర్-విశాఖ (18525) రైళ్లను రద్దు చేసినట్టు పేర్కొన్నారు. కాగా, ఈనెల 16న సికింద్రాబాద్- సంత్రాగచ్చి ఎక్స్‌ప్రెస్ (07234) సికింద్రాబాద్‌లో నిర్ణీత సమయంకన్నా నాలుగు గంటలు ఆలస్యంగా, అలాగే 17న సికింద్రాబాద్-షాలిమార్ ఎక్స్‌ప్రెస్ (07225) సికింద్రాబాద్‌లో నిర్ణీత సమయం కన్నా రెండు గంటలు ఆలస్యంగా బయలుదేరే విధంగా రీ షెడ్యూల్ చేసినట్టు ఆయన వివరించారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	128.00
లైవ్ ధర	148.00
విత్ స్కిన్	266.00
స్కిన్ లెస్	276.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

తుమ్మపాల సంత .. ట్రాఫిక్ చింత

- రోడ్లపైనే వ్యాపారాలు
- రాకపోకలకు వాహనదారుల అవస్థలు
- కానరాని ట్రాఫిక్ పోలీసులు


తుమ్మపాలమెయిన్‌రోడ్డులో ట్రాఫిక్‌లో చిక్కుకున్న వాహనాలు, (ఇన్‌సెట్‌లో) దిబ్బపాలెం రోడ్డులో నిలిపి వేసిన వాహనాలు

తుమ్మపాల, జూన్ 15 : మండలంలోని తుమ్మపాలలో ప్రతి శనివారం జరిగే వారపుసంతతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా మారింది. మెయిన్‌రోడ్డుపై వ్యాపార లావాదేవీలు సాగుతుండడంతో ప్రయాణికులకు చుక్కలు కనబడుతున్నాయి. ఆయా గ్రామాల నుంచి అనకాపల్లి పట్టణానికి చేరుకునే వారు గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్నారు. నియంత్రించాల్సిన ట్రాఫిక్ పోలీసులు అడ్రస్ లేకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు.

తుమ్మపాల ప్రధాన జంక్షన్‌లో జరిగే వారపుసంత కారణంగా ప్రతీ వారం ట్రాఫిక్ సమస్య విపరీతంగా పెరిగిపోతోంది. ఈ జంక్షన్ నుంచి రాకపోకలు సాగించే పలు గ్రామాల ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా దిబ్బపాలెం-వెంకుపాలెం రోడ్డుకు ఆనుకుని ఉన్న గ్రామాల ప్రజలకు పట్టపగలే చుక్కలు కనిపిస్తున్నాయి. మెయిన్‌రోడ్డుపైనే పశువుల అమ్మకాలు, కొనుగోళ్లు సాగుతుండడం, నాటుకోళ్ల వ్యాపారం, కూరగాయలు, వ్యవసాయ పనిముట్లు అమ్మకాలు జరుగుతుండడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఉదయం స్కూళ్లు, కాలేజీలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారస్థులు తుమ్మపాల వద్ద ట్రాఫిక్‌లో చిక్కుకుని తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తుమ్మపాల సంత దాటాలంటే 30 నిమిషాలకు పైగా పడుతుండడంతో నానా అవస్థలు పడుతున్నారు. దీనికితోడు మెయిన్‌రోడ్డుపైనే ద్విచక్ర వాహనాలు, పశువుల తరలింపు వాహనాలు, వ్యాన్‌లను చిందరవందరగా నిలిపివేస్తుండడంతో అడుగు తీసి అడుగు వేసే పరిస్థితి లేకుండా పోతోంది. దిబ్బపాలెం రోడ్డును ఆనుకుని ఉన్న ఊడేరు, బవులవాడ, దిబ్బపాలెం గ్రామాల నుంచి రాకపోకలు సాగించే వారు ట్రాఫిక్‌లో చిక్కుకుని అవస్థలు పడుతున్నారు. అలాగే వెంకుపాలెం రోడ్డులోని తగరంపూడి, సీతానగరం, మెట్టపాలెం, వెంకుపాలెం గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్నారు. పలు సందర్భాల్లో భారీ వాహనాలతో పాటు 108 వాహనం, అంబులెన్స్‌ల సైతం ట్రాఫిక్‌లో చిక్కుకున్న దాఖలాలు ఉన్నాయి. పలు సందర్భాల్లో స్థానిక యువకులు చొరవ చూపి ట్రాఫిక్‌ను నియంత్రించే ప్రయత్నం చేస్తున్నప్పటికీ తిరిగి కథ మొదటికొస్తున్నది. ప్రతీ శనివారం ఉదయం, సాయంత్రం వేళల్లో తుమ్మపాలలో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉండడంతో ఈ రోడ్డులో ప్రయాణించేవారు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళుతున్నారు. అయినప్పటికీ ట్రాఫిక్ పోలీసులు తుమ్మపాల సంతపై కనీసం దృష్టి సారించకపోవడంపై పలువురు విమర్శిస్తున్నారు. ప్రతీ శనివారం తుమ్మపాలలో ట్రాఫిక్ నియంత్రణ కోసం పనిచేయాలని పలువురు కోరుతున్నారు.

అస్తవ్యస్తంగా తుమ్మపాల సంత



తుమ్మపాలలో ప్రతీ శనివారం జరిగే వారపు సంత అస్తవ్యస్తంగా సాగుతోంది. తుమ్మపాల మెయిన్ రోడ్డుపైనే వ్యాపారాలు సాగిస్తూ వాహనదారులకు కొనుగోలు, అమ్మకందారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఎడ పెడ వాహనాలను నిలిపివేస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నారు. చాలా సందర్భాల్లో అంబులెన్స్‌ల సైతం ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్నాయి. - సందిన సునీల్, తుమ్మపాల

ఎన్నికల హామీలను నెరవేరుస్తాం

అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్


సమావేశంలో మాట్లాడుతున్న అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్

పరవాడ, జూన్ 15: ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ పూర్తిస్థాయిలో నెరవేరుస్తామని అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ స్పష్టం చేశారు. కూటమి విజయానికి కృషి చేసిన ప్రతీ ఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. శనివారం స్థానిక కూటమి కార్యాలయం వద్ద కార్యకర్తలతో ఏర్పాటు చేసిన కృతజ్ఞత సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు అద్వితీయమైనదన్నారు. యువతకు ఉపాధి కల్పించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. వైసీపీ నాయకులు టీడీపీ, జనసేన, బీజేపీలోకి రావాలని ప్రయత్నిస్తే.. వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ రానీయవద్దన్నారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు మాట్లాడుతూ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటానని, ఏసమస్యపైన అయినా తనకు ఫోన్ చేస్తే పరిష్కారమార్గాన్ని చూపుతానన్నారు. కాలుష్యం బారిన పడిన గ్రామాలను తరలించేందుకు చిత్తశుద్ధితో కృషిచేస్తానన్నారు. తనకు అఖండ విజయాన్ని చేకూర్చిన ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. పెందుర్తి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జీ మాట్లాడుతూ తన దృష్టికి తీసుకురాకుండా నియోజకవర్గంలో టీడీపీ సమావేశాలు నిర్వహించకూడదన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎంపీలను కూటమి నాయకులు, కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ మాధవ్, మాజీ ఎంపీపీలు పైలా జగన్నాథరావు, మాదంశెట్టి నీలబాబు, మాసవరపు అప్పలనాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు వియ్యపు చిన్న, ఉమ్మడి విశాఖ రూరల్ జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి బుగిడి రామగోవిందరావు, సర్పంచులు సిరపురపు అప్పలనాయుడు, బొద్దపు శ్రీనివాసకాసులు, మోటూరు సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన పాఠ్యపుస్తకాల పంపిణీ

- రాష్ట్ర పరిశీలకుడు ఇస్మాయిల్


పాఠ్యపుస్తకాల స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న ఇస్మాయిల్

రోలుగుంట, జూన్ 15: స్టాక్ పాయింట్‌కు వచ్చిన పాఠ్య పుస్తకాలను ఆయా పాఠశాలలకు సకాలంలో పంపిణీ చేసి విద్యార్థులకు అందించేందుకు సత్వర చర్యలు చేపట్టాలని రాష్ట్ర పరిశీలకుడు ఇస్మాయిల్ విద్యాశాఖ సిబ్బందిని ఆదేశించారు. శనివారం మండలంలోని రోలుగుంట జడ్పీ పాఠశాలలో ఉన్న స్టాక్ పాయింట్, జె.నాయుడుపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. రోలుగుంట స్టాక్ పాయింట్‌కు వచ్చిన విద్యార్థుల కిట్ రికార్డులు, స్టాక్‌లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కిట్స్ నాణ్యత, రికార్డుల నిర్వహణ, ఆన్‌లైన్ నమోదు తదితర అంశాలపై సిబ్బందికి సూచనలు ఇచ్చారు. జె.నాయుడుపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించి ప్రభుత్వం పంపిణీ చేసిన పాఠ్యపుస్తకాల పంపిణీని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు జాన్‌ప్రసాద్, జగ్గారావు, ఆయా పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.

ఐదు లక్షల హెక్టార్లలో పామాయిల్ సాగు లక్ష్యం

- పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ మల్లేశం పూల


పామాయిల్ పంటలను పరిశీలిస్తున్న దృశ్యం

దేవరాపల్లి, జూన్ 15: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఐదేళ్లల్లో దేశంలో ఐదు లక్షల హెక్టార్లలో పామాయిల్ పంటను సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ మల్లేశం పూల తెలిపారు. మలేషియా, ఇండోనేషియాకి సమాంతరంగా ప్రస్తుతం మన దేశంలోని 12 రాష్ట్రాల్లో తమ సంస్థ సహకారంతో సుమారు 50 వేల మంది రైతులు 80 వేల హెక్టార్లలో పామాయిల్ పంటను సాగు చేస్తున్నారన్నారు. దేవరాపల్లిలో కిలపర్తి భాస్కరరావు తదితర రైతులు సాగు చేస్తున్న పామాయిల్ తోటలను ఆయన తన బృందంతో కలిసి పరిశీలించారు. మొక్క చనిపోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు పంట దిగుబడిని పెంచుకోవడానికి అవసరమైన మెలుకువల్ని ఆయన రైతులకు సూచించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో 80 శాతం, తెలంగాణలో 15 శాతం, మిగతా రాష్ట్రాల్లో కేవలం ఐదు శాతం పామాయిల్ పంటను సాగు చేస్తున్నారన్నారు. ప్రస్తుతం పెద్దాపురం, కృష్ణాపురంలో నూనె శుద్ధి కర్మాగారాలు ఉన్నాయన్నారు. అరుణాచల్ ప్రదేశ్‌లో జూలైలో మరో కర్మాగారం ప్రారంభమవుతుందని చెప్పారు. తెలంగాణ, కర్ణాటక, మిజోరాం, అసోం రాష్ట్రాల్లో మరికొన్ని కర్మాగారాలు నెలకొల్పుతామన్నారు. నేషనల్ మిషన్ ఎడిబిల్ ఆయిల్స్ పథకం ద్వారా స్వయం సమృద్ధి (వంట నూనెల అభివృద్ధి) సాధనలో భాగంగా పామాయిల్ పంటకు ప్రోత్సాహం అందుతుందన్నారు. తద్వారా వంట నూనె గురించి ఇతర దేశాలపై ఆధారపడకుండా ప్రతీ హెక్టారుకు 4 టన్నుల నుంచి 20 టన్నుల వరకు పామాయిల్ దిగుబడి వస్తుందన్నారు. మిగతా నూనె గింజల్ని సాగు చేస్తే కేవలం 500 కేజీలకు మించి దిగుబడి రాదన్నారు. దళారులు లేని ఏకైక పంటగా ఆయిల్‌పామ్ గుర్తింపు పొందిందన్నారు. వ్యవసాయం రంగంలో ఈ పంటను సాగు చేసే రైతుకి 75.25 శాతం పంట చేతికందే ఏకైక పంట ఇదేనన్నారు. తమ కొనుగోలు కేంద్రానికి పామాయిల్ గెలలు విక్రయించిన 14 రోజుల్లో రైతుల బ్యాంకు ఖాతాల్లోకి ప్రభుత్వం నిర్ణయించిన ధర ఆధారంగా నగదును జమ చేస్తున్నట్టు చెప్పారు. ప్రస్తుతం టన్ను ఆయిల్‌పాం ధర రూ.13,284లు ఉందన్నారు. రైతుల అభ్యర్థన మేరకు పామాయిల్ గెలలు కొనుగోలు కేంద్రాలను అదనంగా పెట్టడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పామాయిల్ సాగు చేస్తున్న విధానంలో కిలపర్తి భాస్కరరావు అనుసరిస్తున్న విధానాన్ని అభినందించారు. ఆయన వెంట సంస్థ జనరల్ మేనేజర్ టీవీ రమణ, పట్టాభి రామిరెడ్డి, చంద్రశేఖర్, రమేశ్, సురేశ్ తదితరులు ఉన్నారు.

వెంకటగిరి ఐఐహెచ్‌టీలో స్పాట్ అడ్మిషన్లు

అనకాపల్లి రూరల్, జూన్ 15: వెంకటగిరిలోని ప్రగడ కోటయ్య మెమోరియల్ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (ఐఐహెచ్‌టీ)లో డిప్లమో కోర్సులలో ఖాళీ సీట్లను భర్తీ చేసేందుకు స్పాట్ అడ్మిషన్లను నిర్వహిస్తున్నట్టు జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారి ఆర్‌వీ మురళీకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో రెండు, మూడు సంవత్సరాల లేటరల్ ఎంట్రీ (డీహెచ్‌టీడీ)కు ఈనెల 20వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. పదో తరగతి పాసైన విద్యార్థులు అర్హులన్నారు. ఇంటర్మీడియట్ ఎంపీసీ, ఐటీఐలో పాసైన విద్యార్థులకు నేరుగా రెండో సంవత్సరంలోకి ప్రవేశం కల్పిస్తారన్నారు. వయసు 15-23 సంవత్సరాల మధ్య ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు గరిష్ఠ వయో పరిమితి 25 సంవత్సరాలన్నారు. మొదటి సంవత్సరంలో రూ. 1,100, రెండో సంవత్సరంలో రూ. 1,200 స్టైపండ్ ఇస్తారన్నారు. ఆంధ్రప్రదేశ్ , తెలంగాణ రాష్ట్రాల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చునన్నారు. వివరాలకు 8008705688, 9703424768 నంబర్ల ద్వారా సంప్రదించాలన్నారు.

కొండచిలువ హతం


హతమైన కొండచిలువ

రావికమతం, జూన్ 15: కూలీలను హడలెత్తించిన భారీ కొండచిలువ ఎట్టకేలకు హతమైంది. ఈ సంఘటన శనివారం కొమిరలో చోటుచేసుకుంది. మండలంలోని కొమిర గ్రామ శివారులో ఓ రైతుకు చెందిన సరుగుడు తోటను నరికేందుకు శనివారం ఉదయం కూలీలు వెళ్లారు. కూలీలు సరుగుడు కర్రలను కోస్తున్నారు. అప్పటికే తోటలో తుప్పల్లో ఉన్న భారీ కొండచిలువ వారిపైకి ఎగసిపడింది. దీంతో భయభ్రాంతులకు గురైన కూలీలు పరుగులు తీశారు. కొంత సేపటికి కూలీలు దానిని హతమార్చారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ ఫట్టాన్ షియాజ్ ఖాన్

నర్సీపట్నం, జూన్ 15: దేశవ్యాప్తంగా ఈ నెల 29న నేషనల్ లోక్ అదాలత్‌ని విజయవంతం చేయాలని మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి ఫట్టాన్ షియాజ్ ఖాన్ అన్నారు. శనివారం స్థానిక కోర్టు సముదాయంలో పోలీసులు, న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీ పడే అవకాశం ఉన్న సివిల్, క్రిమినల్ కేసులలో కక్షిదారులకు లోక్ అదాలత్‌పై అవగాహన కల్పించాలన్నారు. దీనివల్ల వారికి సమయం, డబ్బు వృథా కాదన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు సివిల్ జడ్జి మధుసూదనరావు, సీనియర్ న్యాయవాది పొక్కునూరి నాగేశ్వరరావు, అనిమిరెడ్డి గోవిందరావు, వాసవి దత్త, మృదుల తదితరులు పాల్గొన్నారు.

వూషూ టోర్నమెంట్‌లో ప్రియాంకకు సిల్వర్ మెడల్


వూషూ క్రీడాకారిణి ప్రియాంక

నర్సీపట్నం, జూన్ 15 : జాతీయ స్థాయి వూషూ టోర్నమెంట్‌లో నర్సీపట్నం ప్రాంతానికి చెందిన ప్రియాంక ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకం కైవసం చేసుకుంది. ఈ నెల 10 నుంచి 14 తేదీ వరకు కర్ణాటక రాష్ట్రం విద్యగిరి, బాగల్కోట్‌లో నిర్వహించిన అఖిల భారత ఉమెన్ నేషనల్ (సౌత్ జోన్) వూషూ టోర్నమెంట్‌లో ప్రియాంక పాల్గొని ఈ ఘనత సాధించింది. ఈ సందర్భంగా ప్రియాంకను ఏపీ వూషూ అసోసియేషన్ సెక్రటరీ ముత్యాలరావు, శాప్ కోచ్ అబ్బు అభినందించారు.

ఎన్టీఆర్ వైద్యాలయంలో పాము కలకలం


పామును పట్టుకున్న సెక్యూరిటీ సిబ్బంది

అనకాపల్లి టౌన్, జూన్ 15: స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో శనివారం ఉదయం పాము కలకలం రేపింది. ఉదయం పది గంటల సమయంలో వైద్యాలయంలోని స్కానింగ్ గదిని సిబ్బంది తీసిన వెంటనే పాము కనిపించడంతో సిబ్బందితో పాటు స్కానింగ్‌కు వచ్చిన రోగులు భయాందోళనకు గురయ్యారు. సెక్యూరిటీ సిబ్బంది స్పందించి వెంటనే స్కానింగ్ గదిలో ఉన్న పెసర పామును చంపి సమీపంలోని కాలువలోకి పడేశారు. పాము కలకలం రేపడంతో అతి సమీపంలో ఓపీ క్యూ లైన్‌లో ఉన్న రోగులు కూడా ఆందోళన చెందారు. ఈ విషయమై ఎన్టీఆర్ వైద్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్‌ను సంప్రదించగా.. వైద్యాలయం ఆవరణలోని పాత అన్న క్యాంటీన్ భవన పరిసరాలు పరిశుభ్రం చేస్తుండగా పెసర పాము బయటకు వచ్చిందని, వెంటనే సిబ్బంది దానిని చంపి దూరంగా పడేశారని వివరించారు.

భద్రతలో రాజీపడొద్దు

- ఎన్టీపీసీ డైరెక్టర్ (ఆపరేషన్స్) రవీంద్రకుమార్


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎన్టీపీసీ డైరెక్టర్ (ఆపరేషన్స్) రవీంద్రకుమార్

పరవాడ, జూన్ 15: పరిశ్రమల్లో భద్రత కల్పించడంలో ఎలాంటి రాజీ పడొద్దని, భద్రతే చాలా ముఖ్యమని ఎన్టీపీసీ డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎస్‌హెచ్ రవీంద్రకుమార్ అన్నారు. సింహాద్రి ఎన్టీపీసీలో దక్షిణ ప్రాంత ప్రాజెక్టుల పనితీరుపై శనివారం ఉన్నతాధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పరిశ్రమల్లో భద్రతకు అధిక ప్రాధాన్యత కల్పించడంపై దృష్టి సారించాలన్నారు. ప్రమాదాలు జరగకుండా, నష్టాలు వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సౌత్ ఆర్ఈడీ ప్రేమ్ ప్రకాష్, ఓఎస్ విభాగం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అరిందమ్ సిన్హా, సీసీ విభాగం ఈడీ విజయ్‌ప్రకాష్, రామగుండం ఈడీ కేఆర్ పాండు, సింహాద్రి సీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా, కుడ్గి సీజీఎం బీఎన్‌ఝా ఏకె మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే

» గిరికిబంద-గరిమండ రోడ్డు అస్తవ్యస్తం
» రహదారి ఆద్యంతం బురదమయం
» ప్రయాణికులు, వాహన చోదకుల నరకం
» కనీసం పట్టించుకోని అధికార గణం

కొయ్యూరు, జూన్ 15: గిరికిబంద-గరిమండ ప్రధాన రహదారి అధ్వానంగా తయారైంది. ఏమాత్రం వర్షం కురిసినా బురదమయమవుతోంది. ఫలితంగా ఈ రోడ్డు ఆధారితంగా రాకపోకలు సాగించే సుమారు పది గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

మండలంలో బూదరాళ్ల పంచాయతీ గరిమండకు వెళ్లే రహదారి గరికిబద నుంచి గరిమండ వరకు సుమారు 3 కిలో మీటర్లు మేర చిన్నపాటి వర్షం కురిసినా అస్తవ్యస్తంగా మారుతోంది. కనీసం నడిచి వెళ్లడానికి కూడా నరకం చూడాల్సి వస్తుంది. ఈ మార్గంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో రోడ్డు పోల్చి గ్రావెల్ వేశారు. అనంతరం వైసీపీ అధికారంలోకి వచ్చాక ఈ రహదారిని మెటల్ రోడ్డుగా మార్చు చేందుకు నిధులు మంజూరు కాగా దుర్వినియోగ మయ్యాయనే వాదన వినిపిస్తున్నది. అనంతరం మరో దఫా ఇదే రోడ్డుపై గత సంవత్సరంలో గ్రావెల్ వేసినట్టుగా చూపి బిల్లుమార్చుకున్నట్టు ఈ ప్రాంతీయులు తెలిపారు.

ఈ రహదారి ఆధారంగా అన్నవరం, కన్నవరం, గొర్రెల మెట్ట పట్టలపాడు, వంతమర్రి నల్లబిల్ల, బొడ్డుమామిడి, రాజులపాడు, బికొత్తవీధి, కునుకూరు, చడిపల్లి, పోకల పాలెం గోదుమలంక, పోతవరం, తూములోవ, గ్రామాల వారు రాకపోకలు సాగించాలి. ముఖ్యంగా ఈ గ్రామాల వారు పెదవలస వారపు సంతకు వెళ్లాలన్నా లేక చింత పల్లి మీదుగా జిల్లా కేంద్రానికి ఏదైనా పనిమీద వెళ్లాలన్నా ఈ మూడు కిలోమీటర్లు రోడ్డు దాటి ప్రయాణించాలి. దీంతో కొద్దిపాటి వర్షం కురిస్తే చాలు బురదమయంగా మారుతుంది. ఇక వర్షాకాలం వస్తే ఈ రహదారి ప్రయాణం నరకమే. ఈ విషయం గత ప్రభుత్వ హయాంలో పలు దఫాలు పాలకులు, అధికారులు దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం శూన్యంగానే మిగిలిందని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు చొరవ తీసుకుని ఈ రహదారి నిర్మాణాలకు మంజూరైయిన నిధులు ఏమైయ్యాయనే విషయమై పూర్తి స్థాయిలో విచారణ జరిపి ఈ రహదారిని రాకపోకలకు వీలుగా నిర్మించేలా చర్యలు చేపట్టాలని పంచాయతీ సర్పంచ్ సాగిన ముత్యాలమ్మ కోరుతున్నారు.


కోతకు గురై గొయ్యిలా కనిపిస్తున్న ముంచంగిపుట్టు రహదారి ఇదే..

అధ్వానంగా ముంచంగిపుట్టు రోడ్డు

ముంచంగిపుట్టు, జూన్ 15: మండల కేంద్రం నుంచి పెదబయలు వెళ్లే మార్గం అధ్వానంగా తయారైంది. చోటాము ఖిపుట్టు సమీపంలో ప్రధాన రహదారి దెబ్బతింది. గత ఏడాది కురిసిన వర్షాలకు ఆ ప్రదేశంలో ఆర్అండ్బీ రోడ్డు కోతకు గురైంది. దాని బాగోగులపై సంబంధిత అధికారులు కనీసం దృష్టిసారించలేదు. ఫలితంగా వర్షాలకు రహదారి మరికాస్త దెబ్బతింది. దీంతో అటుగా రాకపోకలు సాగించే వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. వంతెన ముందు భాగంలో రహదారిపై పెద్ద గొయ్యి ఏర్పడడం, పలు చోట్ల రహదారి కోతకు గురికావడంతో ఆ ప్రదేశంలో తరచూ వాహన ప్రమాదాలు జరుగుతున్నాయి.

ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాల ప్రజలు రాక పోకలు సాగించే ప్రధాన రహదారి మరమ్మ తులకు గురైనా అధికారులు పట్టించుకోక పోవడం పలు విమర్శలకు తావిస్తోంది. రాత్రి వేళల్లో ఆదమరిచి అటుగా వెళితే పెనుప్రమాదం బారిన పడే ఆస్కారం ఉంది. ఈ మార్గంపై నుంచే డుడుమ జలపాతానికి, మాచ్ఖండ్ జల విద్యుత్ కేంద్రానికి పర్యాటకులు ఎక్కువగా వెళుతుంటారు. మరిన్ని ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించి రహదారి మరమ్మతు చేయాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.


గరికిబంద-గరిమండ మధ్య బురదమయంగా మారిన ప్రధాన రహదారి

హోం మంత్రిని కలిసిన గిడ్డి ఈశ్వరి

పాడేరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హోం శాఖ మంత్రిగా నియమితులైన వంగల పూడి అనితను టీడీపీ నియోజవర్గ ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి శనివారం మర్యాదపూర్వ కంగా కలిశారు. ఈ సందర్భంగా అనితకు ప్రేత్యేక శుభాకాంక్షలు తెలి పారు. అలాగే ఉమ్మడి విశాఖప ట్నం జిల్లాకు చెందిన ఎమ్మెల్యే అనితకు హోం శాఖ మంత్రిగా అవ కాశం కల్పించిన సీఎం చంద్రబాబునాయుడుకు గిడ్డి ఈశ్వరి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.గోవిందరావు ఉన్నారు.


హోమ్ మంత్రి అనితకు శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి

మంత్రి సంధ్యారాణికి మన్యం నేతల శుభాకాంక్షలు


మంత్రి సంధ్యారాణితో మన్యంలో టీడీపీ నాయకులు

పాడేరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గిరిజన సంక్షేమ, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి గుమ్మడి సంధ్యారాణిని మన్యంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు శని వారం సాలూరులో మర్యాదపూర్వకంగా కలిశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొర్రా నాగరాజు, తెలుగు మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొర్రా విజయరాణి, నాయకులు ఆనందరావు, బాలరాజు, జగదీశ్, విశ్వనాథం, బి.వరలక్ష్మి, కుమారి తదితరులు మంత్రి సంధ్యారాణిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

భోజన నిర్వాహకులు మెనూ పాటించాలి

చింతపల్లి, జూన్ 15: మధ్యాహ్న భోజన పథకం నిర్వా హకులు తప్పనిసరిగా మెనూ పాటించాలని తహసీల్దార్ టి.రామ కృష్ణ ఆదేశించారు. మండలంలోని చెరు కుంపాకలు ప్రాథమిక పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. తరగతి గదిలో విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనాలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు రుచికరమైన, నాణ్యమైన భోజనాలు పె ట్టాలని నిర్వాహకులను ఆదేశించారు. అలాగే పాఠశాలలో శతశాతం విద్యార్థుల హాజరు ఉండాలని, గైర్హాజరైన విద్యార్థులను గుర్తించి గృహానికి వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థికి కౌన్సెలింగ్ చేసి తిరిగి పాఠశాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన సూచించారు.


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రామకృష్ణ

నాణ్యమైన విత్తనాలు నాటుకోండి


రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు

చింతపల్లి, జూన్ 15: గిరిజన రైతులు విత్తన శుద్ధి చేసిన నాణ్యమైన విత్తనాలను నాటుకోవాలని వ్యవసాయాధికారి శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని కందులగా ది, అంతర్ల గ్రామాల్లో శనివారం రైతులతో ఖరీఫ్ సాగు సన్నద్ధతపై అవగాహన కార్యక్ర మాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో ఖరీఫ్ సాగులో మొక్కజొన్న, వరి, రాగి, సామ, కొర్ర, వేరుశనగ నాట్లు వేస్తున్నారన్నారు. వ్యవసా య శాఖ ద్వారా నాణ్యమైన విత్తనాలు రాయితీపై అందిస్తున్నామని చెప్పారు. రైతులు విత్తనం ఎంపిక, హైబ్రిడ్ వంగడాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలులో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.

ముగిసిన కుట్టు మిషన్ శిక్షణ

ముంచంగిపుట్టు, జూన్ 15: మండల కేంద్రంలోని కల్యాణ మండపంలో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ శని వారంతో ముగిసింది. విశాఖ పట్నం రోటరీ క్లబ్ సంస్థ సహకారంతో గిరిజన మహిళ సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నేతలు ఈశ్వరి, విజయ మాట్లాడుతూ 57 మంది గిరిజన నిరు ద్యోగ మహిళలకు నెల రోజులుగా ట్రైనింగ్ ఇవ్వడం జరిగిందన్నారు. మొత్తం రెండు విడ తల్లో 151 మంది మహిళలకు శిక్షణ ఇచ్చామని, భవిష్యత్‌లో మరి కొంత మందికి ఇస్తామని తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేస్తామన్నారు. మహిళల స్వయం ఉపాధికి ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.


సరిఫికెట్లతో మహిళలు

రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

» టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి

కొయ్యూరు, జూన్ 15: రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి చెప్పారు. మండలంలోని రాజేంద్రపాలెం రైతుభరోసా కేంద్రంలో రైతులకు రాయితీపై విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు ఎన్నికల హామీల్లో భాగంగా ఇచ్చిన మాట నిలబెట్టుకు న్నారన్నారు. రైతు సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని లాండ్ టైటిలింగ్ యాక్టు రద్దుకు సంతకం చేశారన్నారు. అలాగే పింఛను రూ.4 వేలు పెంచారన్నారు. ప్రధానంగా నిరుద్యోగులకు తీపికబురుగా రాష్ట్రంలో ఉన్న 16347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకు ప్రత్యేక డీఎస్సీపై సంతకం చేసినట్టు చెప్పారు. ఈ కార్య క్రమంలో ఏవో ఉమాదేవి, రాజేంద్రపాలెం సర్పంచ్ పీటా సింహాచలం, టీడీపీ నాయకులు తోట దొరబాబు, లోతా జోగిరాజు, అప్పన లక్ష్మణ్, కొర్రు రామూర్తి తదితరులు పాల్గొన్నారు.


రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న గిడ్డి ఈశ్వరి

భారీ వర్షం.. జనం ఉపశమనం

» ఒక్కసారిగా చల్లబడ్డ వాతావరణం

అరకులోయ/ముంచంగిపుట్టు/కొయ్యూరు/హుకుంపేట/జి.మాడుగుల, జూన్ 15: మన్యంలోని పలు మండలాల్లో శనివారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ దారెత్తించింది. మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. సాయంత్రం నుంచి రాత్రి వరకు వాన పడింది. అకాల వర్షం కారణంగా వాతావరణం చల్లబడింది. కాగా, భారీ వర్షానికి ముంచంగిపుట్టు నాలుగు రోడ్ల కూడలితో పాటు పలు రహదారులపై నుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహించింది. వాగులు వంకలు, మత్స్యగెడ్డ పాయల్లోకి వరద నీరు వచ్చి చేరింది. మండల కేంద్రంలో జరిగిన వారపు సంతపై వర్షం ప్రభావం ఎక్కువగా పడింది. మధ్యాహ్నం నుంచి వాతావరణం మారిపోవడంతో సంతకు వచ్చిన వారు త్వరగతిన వెనుదిరిగారు.

అరకులోయలో ముసురు వాతావరణం నెలకొంది. శనివారం సాయంత్రం మూడు గంటల నుంచి ప్రారంభమైన ఈ వాతావరణం సాయంత్రం వరకూ కొన సాగింది. దీంతో పాఠశాలల నుంచి వచ్చే విద్యార్థులు, విధులు నిర్వహించుకొని ఇంటికి చేరే ఉద్యోగులు, పొలం పనుల్లో ఉన్న రైతులు ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం వరకు ఎండగా ఉన్నప్పటికీ సాయంత్రం ముసురు వాతావరణం నెలకొనడంతో వాతావరణం చల్లబడింది. హుకుంపేట మండలంలోని శనివారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ భారీ వర్షం కురిసింది. వారపు సంతకు వచ్చిన జనం, వ్యాపారులు సైతం ఉరుములు, మెరుపులతో పడిన వానకు భయాందోళనకు గురయ్యారు. పాడేరు-హుకుంపేట ప్రధాన మార్గంలో ఉన్న చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. వారపు సంతకు వచ్చిన జనం సైతం తమ గ్రామలకు రాకపోకలు సరిగా లేకపోడంతో ఇబ్బందులు పడ్డారు.

జి.మాడుగుల మండలంలోని శనివారం పలు చోట్ల వర్షం కురిసింది. రెండు రోజుల నుంచి ఉదయం సమయంలో వాతావరణం పొడిగా ఉండి మధ్యాహ్నం ప్రారంభమైంది. సాయంత్రం వరకు వర్షాలు పడింది. ఈ వర్షాలకు గిరిజన రైతులు వ్యవసాయ పనుల్లో బిజీబిజీగా ఉన్నారు. కొయ్యూరు మండల వ్యాప్తంగా శనివారం మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో వర్షం కురిసింది. కొన్ని పంచాయతీలలో భారీగానూ, మరి కొన్ని పంచాయతీలలో మోస్తరుగానూ వర్షం కురవడంతో వరి ఆకులు పోసుకు నేందుకు, నారుమడులు సిద్ధం చేసుకోవడానికి, అపరాలు జల్లుకునేందుకు ఈ వర్షం ఉపకరిస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.


పాడేరు ప్రధాన రహదారిపై హోరున కురుస్తున్న వాన


ముంచంగిపుట్టు రహదారిపై ఏరులై పారుతున్న నీరు

చినుకు పడితే చీకటే..!

» అంధకారంలో మగ్గుతున్న ఆదివాసీలు
» అధికారుల ప్రత్యామ్నాయ చర్యలు శూన్యం

చింతపల్లి, జూన్ 15: చింతపల్లి సబ్ డివిజన్ పరిధిలోని గిరి జన గ్రామాల్లో చినుకు పడితే చీకటి కమ్ముకుంటుంది. తరచూ విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఆదివాసీలు అంధకారంలో మగ్గు తున్నారు. విద్యుత్ అంతరాయం సమస్యలను పరిష్కరించడంలో ఈపీడీసీఎల్ అధికారులు కనీస చర్యలు తీసుకోవడం లేదు. దీంతో గిరిజన ప్రజలకు కరెంట్ కష్టాలు తప్పడం లేదు. చింతపల్లి, జీకే వీధి మండలాల్లో కొరుప్రోలు నుంచి నర్సీపట్నం 133కేవీ ఉపకేంద్రం ద్వారా విద్యుత్ సరఫరా జరుగుతున్నది. గత 15 రోజులుగా రెండు రోజులకు ఒకసారి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతున్నది. విద్యుత్ సరఫరా నిలిచిపోతే గంటల తరబడి వినియోగదారులు నిరీ క్షించాల్సిన దుస్థితిని ఎదుర్కొంటున్నారు. శుక్రవారం చింతపల్లి, జీకే వీధి మండలాల్లో పెద్దగా వర్షం లేకపోయినప్పటికీ మైదాన ప్రాంతా ల్లో భారీ వర్షం కురిసింది. దీంతో నర్సీపట్నం వద్ద విద్యుత్ లైన్‌పై తాటిచెట్టు పడిపోవడంతో మధ్యాహ్నం రెండు గంటలకు విద్యుత్ స రఫరా నిలిచిపోయింది. మరుసటి రోజు ఉదయం నాలుగు గంటలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించలేదు. చింతపల్లి-నర్సీపట్నం 33కేవీ విద్యుత్ లైన్‌లో శనివారం సాయంత్రం ఏర్పడిన సాంకేతిక సమస్య కారణంగా నాలుగు గంటలకు మరోసారి విద్యుత్ సరఫరా నిలిచిపో యింది. రాత్రి వరకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించలేదు. దీంతో గిరిజన ప్రజలు చీకటలో జీవనం సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉన్నతాధికారులు స్పందించి గిరిజన గ్రామాలకు విద్యుత్ అంతరా యం లేకుండా చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

శింగవరంలో విత్తనాల పంపిణీ

కొయ్యూరు, జూన్ 15: శింగవరం రైతుభరోసా కేంద్రంలో ఎంపీపీ బడుగు రమేష్‌బాబు శనివారం రాయితీ విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సరఫరా చేసిన విత్తనాలను రైతులు వినియోగించుకోవాలని సూచించారు.

మారుజాతి వనాలపై గొడ్డలి వేటు

... 3వ పేజీ తరువాయి

వృక్షాలను రెండు రోజులుగా నరికివేస్తున్నారు. ఈ దుంగలను మైదాన ప్రాంతాలకు తరలించేందుకు వ్యాపారులు ఏర్పాట్లు చేసు కుంటున్నారు. రహదారికి ఆనుకుని ఉన్న తోటల్లో విలువైన వృక్షాలు నరికివేస్తున్నప్పటికీ ఏపీఎఫ్‌డీసీ, అటవీ శాఖ, రెవెన్యూ అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, అటవీ శాఖ ఉన్నతాధికారులు స్పందించి కాఫీ తోటలకు నీడనిచ్చే వృక్షాల అక్రమ రవాణాను నిలుపుదల చేయాలని స్థానిక గిరిజనులు కోరారు.

పరాయి పంచన ప్రభుత్వ కార్యాలయాలు!

... 3వ పేజీ తరువాయి

సొంతంగా కుర్చీలు, బెంచీలు ఏర్పాటు చేసుకుని తమ కార్యాలయాలను నిర్వహించు కుంటున్నారు. అలాగే జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయానికి ఇద్దరు సిబ్బందిని నియమించి మిన్న కుండగా, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి సంబంధించిన ఎటువంటి ఏర్పాట్లు చేయలేదు. అలాగే జిల్లా అగ్నిమాపక అధికారి కార్యాలయ కార్యకలాపాలు నిత్యం జరుగుతున్నాయి. రిజిస్ట్రేషన్ కార్యాలయం, జిల్లా ఆడిట్ కార్యాలయం, పన్నుల శాఖ ఏసీ కార్యాలయం, దేవదా య శాఖ ఏసీ కార్యాలయం కేవలం బోర్డులకే పరిమితమయ్యాయి. జిల్లా కలెక్టర్, ఎస్పీ కార్యకలాపాలు మాత్రమే ప్రజలకు తెలుస్తుండగా, మిగిలిన కార్యాలయాల్లో ఏమీ జరుగు తుందో తెలియని పరిస్థితి కొనసాగుతున్నది. ఈ పరిస్థితుల నేపథ్యంలో ప్రస్తుతం మన్యం లోని గిరిజనులకు పాడేరు కేంద్రంగా జిల్లా ఏర్పడినప్పటికీ, డివిజన్ స్థాయి పాలన సాగు తున్న అనుభూతి మాత్రమే కలుగుతున్నది. గతంలో ఐటీడీఏ పీవో నిర్వహించే కార్యకలా పాలను ఇప్పుడు జిల్లా కలెక్టర్ చేపడుతున్నారు. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం జిల్లా అభివృద్ధి, చక్కని పాలనపై దృష్టి సారించాలని మన్యం వాసులు కోరుతున్నారు.

చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం

... 3వ పేజీ తరువాయి

సర్పంచ్ దాసుబాబు, ఇతర పార్టీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు జగన్ రెడ్డి అహంకారానికి, సైకో పాలనకు చరమగీతం పాడి కనీసం ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వకుండా కేవలం 11 స్థానాలకే పరిమితం చేశారన్నారు. ప్రజాగ్రహానికి గురైతే ఎలా ఉంటుందో 2024 ఎన్నికల్లో రాష్ట్ర ప్రజల తీర్పే నిదర్శనమన్నారు. ప్రజలు ప్రతీ అంశాన్ని నిశి తంగా పరిశీలిస్తారని, అరాచక పాలన అంతమొందించడానికి ఎన్నికలు ఎప్పుడు వస్తాయా అని ఎదురుచూశారన్నారు. మెగా డీఎస్సీ, పెన్షన్ల పెంపు, ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు వంటివి చేయడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో పద్మాపురం మాజీ సర్పంచ్ మహ దేవ్, చందూ. త్రినాథ్, అర్జున్, మహిళా నేతలు తులావతి, ద్రౌపతి, గంగా, ఝాన్సీ, నాగ రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన మొదలైంది

... 3వ పేజీ తరువాయి

పడ్డారని, కూటమి గెలుపుతో ప్రజలంతా ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు.

జీవో 3 హామీకి టీడీపీ కట్టుబడి ఉంది..

ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రబాబునాయుడు జీవో 3 పునరుద్ధరణకు కృషి చేస్తా మని ఇచ్చిన హామీకి తెలుగుదేశం పార్టీ కట్టుబడి ఉందని కిడారి శ్రావణ్‌కుమార్ అన్నారు. ఇతర ప్రాంతాలతో సమానంగానే గిరిజన ప్రాంతాల అభివృద్ధి, సంక్షేమానికి సీఎం చంద్రబా బునాయుడు కృషి చేస్తారన్నారు. గత ప్రభుత్వంలో చాలా మంది గిరిజనులకు తీవ్ర అన్యాయం జరిగిందని, తమ ప్రభుత్వంలో వారందరికీ న్యాయం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా టీడీపీ నేతలు, కార్యకర్తలు మిఠాయిలు పంచారు. ఈ సమావేశంలో టీడీపీ నే తలు చల్లంగి లక్ష్మణరావు, బాకూరు వెంకటరమణరాజు, పాంగి పాండురంగస్వామి, సాగర సుబ్బారావు, సిరగం సూర్యకాంతం, కొమ్మా రమాదేవి, టి.సత్యనారాయణ, కిడారి బీంబాబు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

☛ సంక్షిప్తంగా..

వలంటీర్లతో రాజీనామా చేయించిన వైసీపీ నేతలపై చర్యలు చేపట్టాలి

» బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ

పాడేరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): తమ అధికా రంతో మాయమాటలు చెప్పి ఏజెన్సీలో గ్రామ వలంటీ ర్లను రాజీనామాలు చేయించి, వారు రోడ్డున పడేలా చేసిన వైసీపీ నేతలపై కఠిన చర్యలు చేపట్టాలని భార తీయ జనతా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సల్లా రామ కృష్ణ డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామ స్థాయిలో ప్రజలకు సేవలు అంది స్తున్న వలంటీర్లను బెదిరించి, దౌర్జన్యంగా రాజీనామాలు చేయించి ఎన్నికల్లో వినియోగించుకున్న వైసీపీ నేతలు, నేడు వారిని రోడ్డున పడేశారన్నారు. అక్రమ పద్ధతిలో వలంటీర్లతో రాజీనామాలు చేయించిన వైసీపీ నేతలను ప్రభుత్వం గుర్తించి, తగిన విధంగా శిక్షించాలని కోరుతు న్నామన్నారు. అలాగే అన్యాయానికి గురైన ఆయా గ్రామ వలంటీర్ల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేసేందుకు కృషి చేస్తామన్నారు.

రాష్ట్రంలో మార్పునకు బాబు శ్రీకారం

» టీడీపీ సీనియన్ నేత లక్ష్మయ్య

చింతపల్లి, జూన్ 15: ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన చంద్రబాబు రెండో రోజు నుంచే రాష్ట్రంలో మార్పునకు శ్రీకారం చుట్టారని టీడీపీ సీనియర్ నాయ కుడు కిముడు లక్ష్మయ్య అన్నారు. శనివారం లంబసింగి గ్రామంలో పింఛన్ పెంపుపై వృద్ధులతో కలిసి చంద్ర బాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలనకు ప్రజలు ఓటు స్వస్తి చెప్పారన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ నాయకత్వాన్ని కోరుకుంటూ కూటమికి ప్రజలు అధికారం కట్టబెట్టారన్నారు. కూటమి ప్రభుత్వంపై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నెరవేర్చుతూ బాధ్యతలు స్వీకరించిన రెండో రోజే పింఛన్ పెంపు, మెగా డీఎస్సీపై చంద్రబాబు సంతకాలు చేశారన్నారు. పింఛన్ పెంపుపై వృద్ధులు, దివ్యాంగులు సంతోషం వ్యక్తం చేస్తున్నార న్నారు. డీఎస్సీ ప్రకటించడంతో నిరుద్యోగులకు ఉద్యో గాలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయ కులు లువ్వాబు రామరావు, బోనంగి చెన్నలింగేశ్వరరావు, టీడీపీ అభిమానులు పాల్గొన్నారు.

డిగ్రీ పూర్వ విద్యార్థుల సమావేశం రేపు

పాడేరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పూర్వ విద్యార్థులతో ఈ నెల 17న సమావేశాన్ని నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ వనుము చిట్టబ్బాయి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక డిగ్రీ కళాశాలలో చదువుకుని వివిధ ప్రాంతాల్లో స్థిర పడిన పూర్వ విద్యార్థులందరూ ఈ సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

19న వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

చింతపల్లి, జూన్ 15: స్థానిక విద్యుత్ ఉప కేంద్రంలో ఈ నెల 19వ తేదీన వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఏపీఈపీ డీసీఎల్ ఏఈఈ వనుము ప్రభాకరరావు తెలిపారు. శని వారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వినియోగదా రుల సమస్యలను పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, విద్యుత్ వినియోగదారుల హాజరై సమస్యలను తెలపాలని కోరారు. ఈ కార్యక్రమానికి సీడీఆర్ఎఫ్ ఛైర్‌పర్సన్ డాక్టర్ బి.సత్యనారాయణ, సాంకే తిక సభ్యులు వి.జనార్దనరావు, ఆర్థిక సభ్యులు ఎం.శ్రీని వాశ్, స్వతంత్ర్య సభ్యులు డాక్టర్ ఆర్.సురేంద్రకుమార్ హాజరుకానున్నారని ఆయన తెలిపారు.

ఆశ్రమ పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కొయ్యూరు, జూన్ 15:: మండలంలోని పి.మాక వరం, రావణాపల్లి బాలికల ఆశ్రమ పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు దేవేశ్వరరావు, మృదుభాషిణి తెలిపారు. పి.మాక వరం గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో మూడో తరగతిలో 40, నాలుగులో 31, ఐదులో 23, ఆరులో 31 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. అలాగే రావ ణాపల్లి ఆశ్రమ పాఠశాలలో మూడో తరగతిలో 80, నాలుగులో 77, ఐదులో 72, ఆరులో 60, ఏడులో 15, ఎనిమిదిలో ఐదు, తొమ్మిదిలో 35 ఖాళీలు ఉన్నాయని హెచ్ఎం చెప్పారు. ఆసక్తి గల విద్యార్థులు విద్యార్హత ధ్రువపత్రాలతో పాఠశాలను సంప్రదించాలని కోరారు.

సీలేరు గురుకులంలో...

సీలేరు: గూడెంకొత్తవీధి మండలంలోని సీలేరు బాలుర గిరిజన గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ బుజ్జిబాబు తెలిపారు. నాలుగో తరగతి పాసైన విద్యార్థులు ఐదులో చేరేందుకు సర్టిఫికెట్లతో నేరుగా పాఠశాలను సంప్రదించాలని సూచించారు.

కొత్తుభల్లుగుడ ఆశ్రమోన్నత పాఠశాలలో...

అరకులోయ: మండలంలోని కొత్తభల్లుగుడ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో 296 సీట్లు ఖాళీగా ఉన్నాయని హెచ్ఎం టి.పద్మావతి తెలిపారు. మూడు నుంచి ఐదో తరగతి వరకు ఒక్కో తరగతిలో 80 సీట్లు చొప్పున ఖాళీగా ఉన్నాయన్నారు. అలాగే ఆరో తరగతిలో 56 సీట్లు ఖాళీగా ఉన్నట్టు చెప్పారు. ఈ సీట్ల భర్తీకి దరఖాసులుఉ ఆహ్వానిస్తున్నామని, ఆసక్తి గల బాలికల తల్లిదండ్రులు పాఠశాల పనివేళల్లో తమను సంప్రదించాలని హెచ్ఎం సూచించారు.

స్పెషల్ డీఎస్సీ ప్రకటించాలి

సీలేరు, జూన్ 15: ఆదివాసీ గిరిజన నిరుద్యోగుల కోసం స్పెషల్ డీఎస్సీ ప్రకటించాలని సీపీఎం మండల కార్యదర్శి, గాలికొండ ఎంపీటీసీ సభ్యుడు ఎ.బుజ్జిబాబు కోరారు. గత ప్రభుత్వం నిరుద్యోగులకు ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించి యువతకు తీవ్ర అన్యాయం చేసిం దని ఆరోపించారు. దీంతో గత ప్రభుత్వానికి నిరుద్యో గులు గుణపాఠం చెప్పారన్నారు. కొత్త ప్రభుత్వమైనా జీవో నంబర్-3ను పునరుద్ధరించాలని కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

కొయ్యూరు, జూన్ 15: చీడిపాలెం పంచాయతీ శింగవరం ఐటీడీఏ కాలనీ సమీపంలో కాలువ వద్ద గుర్తు తెలియని వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మ హత్యకు పాల్పడ్డాడు. ఈ విషయం ఎస్ఐ రామకృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. సుమారు నాలుగైదు రోజుల క్రితం ఈ ఘటనకు పాల్ప డినట్టు మృతదేహ పరిస్థితిని బట్టి తెలుస్తున్నది. ఉరి వేసుకున్న వ్యక్తి ఏ ప్రాంతానికి చెందిన వారు, అందుకు గల కారణాలు తదితర కోణాల్లో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించామని, ఆధారాల కోసం అన్వేషి స్తున్నామని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.